హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షల విరాళం చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి. దీంతోపాటు 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్లాంటేషన్ డ్రైవ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఈ ఏడాది 18 లక్షల మొక్క లను నాటనున్నారు.

బీడీఎల్ టెక్నికల్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) డైరెక్టర్ (టెక్నికల్)గా డీవీ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రక్షణ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఈ పదవి చేపట్టడానికి ముందు ఆయన బీడీఎల్‌లో అంతర్గత పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) విభాగానికి జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. బీడీఎల్‌లో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని స్థాపించడంలో శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్, హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డిజిటల్ సిస్టమ్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశారు. తదనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చేశారు.

ఆభరణాల ఎగుమతులు డౌన్

ఆగస్టు నెలలో 19 శాతం తగ్గి 2 బిలియన్ డాలర్లకు..

ముంబై, సెప్టెంబర్ 23: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోవడంతో గత నెలకుగాను 2.01 బిలియన్ డాలర్ల విలువైన జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతి అయ్యాయని రత్నాల అభరణాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఎగుమతైన 2.47 బిలియన్ డాలర్లతో పోలిస్తే 18.79 శాతం తగ్గినట్లు పేర్కొంది. అమెరికా, చైనా మార్కెట్లో దేశీయ ఆభరణాలకు డిమాండ్ పెంచడానికి కృషి చేస్తున్నట్లు, డిమాండ్ పడిపోవడంతో మధ్యస్థాయి ఆభరణాల తయారీ సంస్థలకు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టుతున్నాయని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా తెలిపారు. గత నెలలో కట్, పాలిష్డ్ డైమండ్ల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 26 శాతం తగ్గి బిలియన్ డాలర్లకు పడిపోయాయన్నారు. అలాగే బంగారు ఆభరణాల ఎగుమతులు కూడా 1.15 శాతం తగ్గి 687.69 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on X@SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

టెండర్ నోటిఫికేషన్ నెం.Y/C.210/Halt/Notification/2024-25

తేది: 23-10-2024

PUB/0942/24

దిగువ తెలిపిన కాలానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన హాల్ట్ ఏజెంట్ ఉద్యోగ నియామకం నిమిత్తం సంబంధిత హాల్ట్ స్టేషన్ గల ఏరియాలో శాశ్వత నివాసితులైన అర్హత గల వ్యక్తుల నుండి సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్ డివిజన్, సికింద్రాబాద్-500025 వారు భారత రాష్ట్రపతి తరపున దరఖాస్తులు కోరుతున్నారు. హాల్ట్ ఏజెంట్‌ను నియమించే హాల్ట్ స్టేషన్ల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

క్ర. సం.	హాల్ట్ స్టేషన్/ కోడ్ పేరు	సమీప స్టేషన్	స్టేషన్ల మధ్య గలది	సెక్షన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి
1	శ్రీనివాస నగర్ (SHAN)	మాసాయిపేట	మాసాయిపేట నుండి వడియారం	సికింద్రాబాద్-ముద్ఖేడ్	(5) సంవత్సరాలు
2	అల్వాల్ (ALW)	బొల్లారం	మల్కాజ్‌గిరి నుండి బొల్లారం	సికింద్రాబాద్-ముద్ఖేడ్	
3	బొల్లారం బజార్ (BOZ)	బొల్లారం	మల్కాజ్‌గిరి నుండి బొల్లారం	సికింద్రాబాద్-ముద్ఖేడ్	
4	అప్పాయిపల్లి (APMR)	గజ్వేల్	మనోహరాబాద్ నుండి గజ్వేల్	మనోహరాబాద్-సిద్దిపేట	
5	బూర్గుల (BRGL)	బాలానగర్	షాద్‌నగర్ నుండి బాలానగర్	సికింద్రాబాద్-డోన్	
6	నాచారం (NCRM)	మనోహరాబాద్	మనోహరాబాద్ నుండి గజ్వేల్	మనోహరాబాద్-సిద్దిపేట	స్టేషన్లు బ్లాక్ స్టేషన్లుగా ప్రారంభించు వరకు తాత్కాలికం
7	లక్డారం (LKDM)	గజ్వేల్	గజ్వేల్ నుండి సిద్దిపేట	మనోహరాబాద్-సిద్దిపేట	
8	దుద్దెడ (DDDA)	సిద్దిపేట	గజ్వేల్ నుండి సిద్దిపేట	మనోహరాబాద్-సిద్దిపేట	
9	కున్సి (KUSI)	మాగనూర్	మాగనూరు నుండి క్రిష్ణా	దేవరకద్ర-క్రిష్ణా	(5) సంవత్సరాలు
10	దసరా దొడ్డి (DDDI)	మాగనూర్	జక్లయిర్ నుండి మాగనూర్	దేవరకద్ర-క్రిష్ణా	

దరఖాస్తు చేసుకొను విధానం: దరఖాస్తులు అన్ని విధాల పూర్తి చేసి మరియు అన్ని ఎన్‌క్లోసర్స్‌తో తగువిధంగా సీల్ చేసి దిగువ తెలిపిన ప్రదేశంలో ఏర్పాటుచేసిన బాక్స్‌లో వేయవలెను.

చిరునామా/ లోకేషన్	టెండర్ హాల్, DRM/HYBs కాంపౌండ్, పాత RPF ఆఫీస్, హైదరాబాద్ భవన్ దగ్గర, సికింద్రాబాద్-500025
తేది	23-10-2024
సమయం	10.00 గం. నుండి 12.00 గం. వరకు.

A1212 డివిజినల్ రైల్వే మేనేజర్/కమర్షియల్/హైదరాబాద్

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం

1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068

ఫోన్ నం.లు 040-29803086/3186, ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో: హైదరాబాద్ వద్ద (ప్రారంభ అధికారపరిధి)

కంపెనీల చట్టం, 1956 విషయంలో

M/s. శ్రీ విష్ణుప్రియ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో

కంపెనీ పిటీషన్ నం. 168/2002

ఇ-వేలం ద్వారా అసెట్ల అమ్మకం కొరకు ప్రకటన

గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ వద్ద తేది: 14.06.2024 గల ఉత్తర్వులు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి "**ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక**"పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తులు అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

అసెట్లు, రిజర్వు ధర, బయానా మరియు బిడ్ పెంపుదల వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

అసెట్ల వివరణ	రిజర్వు ధర (రూ.లక్షలలో)	బయానా (EMD) (రూ.లక్షలలో)	బిడ్ పెంపుదల విలువ (రూ.లక్షలలో)
ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా, పాణ్యం గ్రామము వద్ద గల ఫ్యాక్టరీ ఆవరణ వద్ద భవనాలు, సివిల్ పనులు/కట్టడాలతో పాటు వివిధ సర్వే నంబర్లలోని సుమారు ఎ. 41.09 సెంట్లు భూమి.	2662.00	267.00	2.00

గమనిక:

i) 04.10.2024 & 05.10.2024 తేదీలలో ఉ. 11.00గం. నుండి సా. 5.00గం.మధ్య పాణ్యం గ్రామం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద గల పై అసెట్లను తనిఖీ చేసుకోవచ్చు.

ii) ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700**లో NEFT/RTGS విధానం ద్వారా రూ. 2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే)ల వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము చెల్లించాల్సి వుంటుంది మరియు దానిని 24.10.2024న సా. 4.00 గంటల లోగా డిపాజిట్ చేయవలెను.

iii) **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700**లో NEFT/RTGS విధానం ద్వారా బయానా మొత్తం (వడ్డీ లేదు) డిపాజిట్ చేయాలి. బయానా డిపాజిట్ చేయుటకు ఆఖరి తేది 24.10.2024న సా. 4.00 గంటలలోగా మరియు మద్దతు డాక్యుమెంట్లుతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేది 25.10.2024న మ. 3.30 గం.లోగా.

iv) టెండరుదార్లు వెబ్‌సైట్: **https://ol.auctiontiger.net** ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.

v) ఇ-వేలం గురించి వివరాలు/ సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్)** కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. **మొబైల్ నం. +91 9722778828.**

vi) ఇ-వేలం వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net** ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో 29.10.2024న **ఉ. 11.30 గం. నుండి మ. 2.30గం.** మధ్య నిర్వహించబడుతుంది.

vii) అమ్మకం గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.

viii) కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/ అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/ కంట్రిబ్యూటార్స్/ కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు/సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.

ix) కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున **మ. 2.00 గం. నుండి మ. 3.00 గం.**మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత భూమి డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లోకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు. భవిష్యత్తులో దీనికి సంబంధించి ఏదైన వివాదం ఉన్నచో దానిని అఫీషియల్ లిక్విడేటర్ పరిగణించరు.

x) **అమ్మకం నియమ నిబంధనలతోపాటు** పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net**లో లభిస్తాయి.

xi) పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/ అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/ రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

తేది: 20.09.2024 సం/- (U.K.సాహూ, ICLS)

ప్రదేశం: హైదరాబాద్ **అఫీషియల్ లిక్విడేటర్,**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

బాబ్బాబు కొనండయ్యా..

హిందుస్థాన్ జింక్ వాటా విక్రయానికి దేశ, విదేశాల్లో రోడ్‌షోలు చేస్తున్న మోదీ సర్కారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'భలే మంచి చౌక బేరము.. ఇది సమయము మించినన్ దొరకదు త్వరంగొనుడు సుజనులారా' అన్నట్టు ప్రభుత్వ రంగ సంస్థల విక్రయానికి, ప్రైవేట్ రంగ కంపెనీల్లో మిగులు వాటాల అమ్మకానికి దేశ, విదేశాల్లో మోదీ సర్కారు చక్కర్లు కొడుతున్నది. ఒకప్పుడు సర్కారీ సంస్థగా, ఇప్పుడు వేదాంత గ్రూప్ కంపెనీగా ఉన్న హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌లో కేంద్ర ప్రభుత్వానికి 29.5 శాతం వాటా ఉన్నది. దీన్ని అమ్ముకొనేందుకు గత 15 రోజుల్లో ముంబై, లండన్, బోస్టన్, న్యూయార్క్ వంటి ప్రముఖ నగరాల్లో కేంద్రం రోడ్‌షోలు నిర్వహించింది.

మదుపరుల కోసమే..

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగానే ఈ రోడ్‌షోలు చేపడుతున్నామని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అన్నారు. ఇన్వెస్టర్లను ఆకట్టుకొనేందుకు, మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకూ ఇవి ఉపయోగపడుతాయని చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఫైనాన్షియల్ హబ్స్‌గా ఉన్న ముంబై, సింగపూర్, హాంకాంగ్, లండన్, బోస్టన్, న్యూయార్క్‌ల్లో ఇప్పటిదాకా రోడ్‌షోలు నిర్వహించామని యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్ అండ్ జియోపార్క్స్ ఇన్ ఇండియాపై జరిగిన శిక్షణ-వర్క్‌షాప్ కార్యక్రమానికి హాజరైన ఆయన తెలిపారు. అయితే ఎప్పట్లోగా, ఎంత? వాటాను అమ్ముతారన్న ప్రశ్నకు బదులిస్తూ.. 'ముందు ఈ రోడ్‌షోలు పూర్తవనివ్వండి.. ఆ తర్వాత ఓ నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. ఇందుకోసం ఓ కమిటీ ఉందని కూడా చెప్పారు.

లాభాల్లో ఉన్నా..

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణే లక్ష్యంగా ముందుకెళ్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు.. లాభనష్టాలతో సంబంధం లేకుండా అన్నింటినీ అమ్మేయాలనే చూస్తున్నది. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హిందుస్థాన్ జింక్ నికర లాభం గతంతో పోల్చితే 19.4 శాతం పెరిగింది. రూ.2,345 కోట్లుగా ఉన్నది. ఆదాయం కూడా రూ.7,564 కోట్ల నుంచి రూ.8,398 కోట్లకు పెరిగింది. అయినప్పటికీ మిగులు వాటాలను వదిలించుకోవడానికే పెద్దపీట వేస్తుండటం గమనార్హం. ఇక గతంలో ప్రతిపాదించిన మూడు వర్టికల్స్‌కు బదులుగా రెండు వర్టికల్స్‌లోకే కంపెనీని విభజించాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వంతో తాజాగా చర్చలు జరిపినట్టు సంస్థ సీఈవో అరుణ్ మిశ్రా తెలిపారు. హిందుస్థాన్ జింక్‌ను వేర్వేరు సంస్థలుగా విభజించాలన్న పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆపేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా సంప్రదింపులు సానుకూలంగా జరిగినట్టు మిశ్రా చెప్తున్నారు. సంస్థలో మెజారిటీ వాటా వేదాంతదే అయినప్పటికీ వ్యాపార కార్యకలాపాల పునర్నిర్మాణానికి తమ ఆమోదం ఉండాలంటూ గనుల మంత్రిత్వ శాఖ హుకుం జారీ చేసింది. అందుకే కేంద్రంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. కాగా, హిందుస్థాన్ జింక్‌లో మిగులు వాటాను ఓపెన్ మార్కెట్‌లో ఉపసంహరించుకోవచ్చని 2021లో సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. దీంతో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా వాటాల అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు కేంద్రం గతంలోనే ప్రకటించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు అడుగులు వేస్తున్నది.

- 1966లో ఏర్పాటైన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్.. జింక్, లెడ్, వెండి, కాడ్మియంలను ఉత్పత్తి చేస్తున్నది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ దీని ప్రధాన కేంద్రం.
- హిందుస్థాన్ జింక్.. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ జింక్ ఉత్పత్తిదారు. వెండి ఉత్పత్తిలోనూ మూడో స్థానంలో ఉన్నది.
- ప్రధానంగా దేశీయ జింక్ మార్కెట్‌లో 75 శాతానికిపైగా వాటా ఈ సంస్థదే. 40కిపైగా దేశాలకూ ఈ కంపెనీ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఒక్కో షేర్‌కు రూ.19 చొప్పున మొత్తం రూ.8,028.11కోట్ల మధ్యంతర డివిడెండ్‌కు వేదాంత గ్రూప్ అనుమతిచ్చింది.

జియో సరికొత్త ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 98 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ 5జీ డాటా, కాలింగ్‌తో కూడిన రూ.999 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. దీర్ఘకాలికంగా డాటా, కాలింగ్‌ను కోరుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని ఈ నయా ప్లాన్‌ను తీసుకొచ్చింది సంస్థ. ఈ ప్లాన్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లు వర్తించనున్నది. దీంతోపాటు రోజుకు 100 ఎస్‌ఎంఎస్, దేశవ్యాప్తంగా రోమింగ్ ఫ్రీ, జియో క్లౌడ్, జియో సినిమా, జియో టీవీలను ఉచితంగా అందిస్తున్నది.

హైదరాబాద్‌లో ఆస్టర్ నూతన దవాఖాన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్..హైదరాబాద్‌లో మరో దవాఖానని నెలకొల్పడానికి సిద్ధమైంది. ఇప్పటికే అమీర్‌పేట్‌లో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్న సంస్థ తాజాగా ఇక్కడే రూ.220 కోట్లతో నూతన ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించింది. 300 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆసుపత్రిలో అన్ని వయసుల పిల్లలు, మహిళలకు హెల్త్‌కేర్ సేవలు అందించనున్నట్టు తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఈ ఆసుపత్రి అందుబాటులోకి రానున్నట్లు ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఫౌండర్, చైర్మన్ ఆజాద్ మూపెన్ తెలిపారు.

85 వేల దిశగా సెన్సెక్స్

మరో 384 పాయింట్లు పెరిగిన సూచీ



ముంబై, సెప్టెంబర్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను భవిష్యత్తులోనూ తగ్గించే అవకాశాలుండటం, ఆసియా మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సెన్సెక్స్ మరో మైలురాయి 85 వేల స్థాయికి చేరువైంది. ఎనర్జీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు గ్లోబల్ మార్కెట్లు లాభాల్లో ముగియడం కలిసొచ్చింది. ఇంట్రాడేలో 85 వేల చేరవకు 84,980 వద్దకు చేరుకున్న 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 384.30 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 84,928.61 స్థాయి వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. మరో సూచీ నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26 వేలకు చేరువైంది. చివరకు 148.10 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 25,939.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఫెడ్ వడ్డీరేట్లను మరోసారి తగ్గించే అవకాశాలుండటం సూచీలకు దన్నుగా నిలిచాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ గెయినర్‌గా మహీంద్రా

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా షేరు టాప్ గెయినర్‌గా నిలిచింది. కంపెనీ షేరు ధర 3.29 శాతం ఎగబాకింది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ కూడా 2.55 శాతం ఎగబాకగా, భారతీ ఎయిర్‌టెల్ 2.25 శాతం, కొటక్ బ్యాంక్ 1.71 శాతం లాభపడ్డాయి. వీటితోపాటు బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్ లాభపడంతో సూచీలు రికార్డు స్థాయికి చేరువవడానికి దోహదపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ అత్యధికంగా 2.23 శాతం లాభపడగా, రియల్టీ 2.07 శాతం, టెలికం, ఎనర్జీ, ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్, యుటిలిటీ రంగ షేర్లు లాభాల్లో ముగియగా..కేవలం ఐటీ రంగ షేర్లు నష్టపోయాయి.

మూడు రోజుల్లో 8.30 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పుంజుకుంటుండటంతో గత 3 రోజుల్లో మదుపరుల సంపద రూ.8 లక్షల కోట్లకు పైగా పెరిగింది. దీంతో బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,76,03,923.17 కోట్లకు చేరింది.

రూ.1.8 లక్షల కోట్ల నష్టం

గత 3 ఏండ్లలో ఎఫ్అండ్‌వోల్లో కోటికిపైగా ట్రేడర్లకు దెబ్బ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'హై-రిస్క్ హై-రివార్డ్' గేమ్‌గా పేరున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌లో నష్టపుటేరులు పారుతున్నాయి. 2021-22 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌లో 1.13 కోట్ల రిటైల్ ట్రేడర్లు రూ.1.81 లక్షల కోట్లు కోల్పోయారు మరి. ఈ మూడేండ్లలో ఒక్కో ఇండివీడ్యువల్ ట్రేడర్‌కు సగటున దాదాపు రూ.2 లక్షల (లావాదేవీ ఖర్చులతోసహా) నష్టం వాటిల్లింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) విషయానికే వస్తే.. 73 లక్షల మందికి సగటున రూ.1.2 లక్షల లాస్ వచ్చింది. ఇదంతా కలిపితే రూ.75,000 కోట్లుగా ఉన్నది. ఈ మేరకు సోమవారం మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ విడుదల చేసిన ఓ అధ్యయనం తెలిపింది. కాగా, ఈ సెగ్మెంట్‌లో కేవలం 7.2 శాతం మందే లాభపడ్డారు. ఒక్కో మదుపరి సగటు లాభం రూ.3 లక్షలుగా ఉన్నది. ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల్లో రిటైల్ ఇన్వెస్టర్లు చురుగ్గా పాల్గొంటుండటంపట్ల సెబీ తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

అన్మోల్ అంబానీపై కోటి జరిమానా

అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీపై సెబీ కోటి రూపాయల జరిమానా వేసింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ కేసులో కార్పొరేట్ రుణాలను ఆమోదించేటప్పుడు అశ్రద్ధ వహించారని, నిబంధనల్ని పాటించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఫైన్ విధించింది. అలాగే రిలయన్స్ హౌజింగ్ ఫైనాన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ కృష్ణన్ గోపాలకృష్ణన్‌పైనా రూ.15 లక్షల జరిమానా వేస్తూ సెబీ నిర్ణయం తీసుకున్నది. ఈ ఇరువురు 45 రోజుల్లోగా ఈ జరిమానాలను చెల్లించాలని కూడా ఆదేశించింది. గత నెల అనిల్‌పైనా రూ.25 కోట్ల జరిమానా పడ్డది తెలిసిందే. కాగా, బ్రైట్‌కామ్ గ్రూప్‌పై సెబీ రూ. 8 లక్షల జరిమానా విధించింది.

అడవిలో చెట్లు నరికిన ఒకరిపై కేసు నమోదు

రుద్రూర్, సెప్టెంబర్ 23 : వర్ని మండలం తగిలేపల్లి ఫారెస్టు పరిధిలో చెట్లు నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి బాబు సోమవారం తెలిపారు. ఈనెల 20న చెట్లు నరికినట్లు సమాచారం తెలుసుకొని దర్యాప్తు చేపట్టామని, తగిలేపల్లి తండాకు చెందిన రవీందర్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చెట్లు నరికిన వారిలో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం ఉన్నదని, విచారణ కొనసాగుతున్నదని పేర్కొన్నారు.

'ప్రజావాణి'కి 97 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 23 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడించారు. జిల్లాని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, అదనపు ఎస్పీ బస్వారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

జీతాలు ఇప్పించాలని జీపీ కార్మికుల వినతి

నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన రొడ్డ పెద్దసాయిలు, గైని పెద్ద సాయిలు తమకు జీతాలు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. కొన్నేండ్లుగా యంచ జీపీలో కార్మికులుగా పనిచేస్తున్నామని, నాలుగు నెలల నుంచి జీతాలు రావడంలేదని పేర్కొన్నారు. కార్యదర్శిని అడిగితే నిధులు లేవని చెబుతున్నారని, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమకు వెంటనే జీతాలు ఇప్పించాలని కోరారు.

ఇండ్ల నిర్మాణం కోసం అనుమతి ఇప్పించాలని దివ్యాంగులు..

ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామశివారులో గుడిసెలు వేసుకొని, నివాసముంటున్న తాము ఇండ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇప్పించాలని బాలాజీ వికలాంగుల సంఘం సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండేండ్ల క్రితం తమకు పట్టాలు ఇచ్చిందని, ఇండ్లు నిర్మించుకునేందుకు పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి ఉన్నదని, అనుమతి కావాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని అంటున్నాడని, తమకు అనుమతి ఇప్పించాలని కోరారు.

నష్టపరిహారం ఇప్పించాలని సాలురా గ్రామస్తులు..

బోధన్ - భైంసా రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన సాలూరా గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద వినతిపత్రాలతో సాలూరా గ్రామస్తులు

లారీ ఢీకొని భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

ఇందల్వాయి, సెప్టెంబర్ 23 : ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయరహదారి గన్నారం కమాన్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా.. భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన కుర్మ చిన్న బుజ్జి మల్లయ్య తన భార్య గంగవ్వతో కలిసి ద్విచక్రవాహనంపై ఇందల్వాయి మండలకేంద్రానికి వెళ్తున్నాడు. గన్నారం కమాన్ యుటర్న్ వద్ద వెనుకవైపు నుంచి వచ్చిన లారీ వీరి ద్విచక్రవాహన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగవ్వ అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్న బుజ్జిమల్లయ్య తీవ్రగాయాలయ్యాయి. చిన్నబుజ్జి మల్లయ్యను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి, లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాలూరాలో తండ్రి మృతి.. కుమారుడికి గాయాలు

బోధన్ రూరల్, సెప్టెంబర్ 23: స్కార్పియో వాహనం ఢీకొని తండ్రి మృతిచెందగా.. కుమారుడికి గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం సాలూరా మండలశివారులో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరా మండలం హున్సా గ్రామానికి చెందిన కట్టెకాల సంజీవ్ (45) సొంత పనుల నిమిత్తం తన కుమారుడితో కలిసి బైక్‌పై బోధన్‌కు వెళ్తున్నాడు. మహారాష్ట్ర నుంచి వస్తున్న స్కార్పియో వాహనం వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవ్ అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడు అనిల్‌కు గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, స్కార్పియో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీకి యత్నం

దొంగను పట్టుకొని చితకబాదిన స్థానికులు, పోలీసులకు అప్పగింత

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23 : నగరంలో తాళం వేసిన ఓ ఇంట్లో పట్టపగలే చోరీకి వచ్చిన దుండగుడిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం తాళ్లతో బంధించి పోలీసులకు అప్పజెప్పారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని సీఎం రోడ్డులో ఉండే వాజిద్ సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. అదే సమయంలో నసీర్ అనే యువకుడు తలుపులను ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి, బీరువా ధ్వంసం చేస్తుండగా.. యజమాని ఇంటికి తిరిగి వచ్చాడు. దొంగ పారిపోయేందుకు యత్నించగా.. స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. దుండగుడికి దేహశుద్ధి చేసి, తాళ్లతో బంధించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, నిందితుడిని ఠాణాకు తరలించారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి రిమాండ్

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 23: బోధన్ శివారులోని ఆటోనగర్‌లో ఓ కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి ఆటోనగర్‌లోని ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగినట్లు ఆ దుకాణ యజమాని గుర్తించి సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు కూడా ఆటోనగర్‌కు చెందిన వారేనని సీఐ తెలిపారు.

బాసర రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో ప్రయాణికుడు మృతి

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23 : తన భార్యతో కలిసి దైవదర్శనం కోసం వెళ్లేందుకు వెళ్లిన వ్యక్తి రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో మృతి చెందిన ఘటన ఘటన బాసర రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటు చేసుకున్నది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సిరపల్లి గ్రామానికి చెందిన రావు సాబ్ (38) అతడి భార్య సవితతో కలిసి పండరిపూర్ ఆలయానికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రావుసాబ్ ఫిట్స్‌తో కిందపడగా.. స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది అక్కడి చేరుకొని, రావుసాబ్ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహన్ని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీలోకి స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 23: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం ప్రాజెక్టులోకి 14170 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు)కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1091 అడుగులు (80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్టు నుంచి కాకతీయకాలువకు 6000 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, వరదకాలువకు 5 వేల క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. స్వల్పంగా వరద పెరగడంతో ఎస్కేప్ గేట్ల ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగిన రాష్ట్రస్థాయి 10వ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల జట్టు ఫైనల్‌లో ప్రథమ స్థానంలో, బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గెలిచిన జట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు.

12 బెటాలియన్ ఆధ్వర్యంలో వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం

కంఠేశ్వర్, సెప్టెంబర్ 23 : నగరంలోని రాజారాం స్టేడియం, డైట్ కళాశాల మైదానంలో 12వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం సోమవారం ప్రారంభమైనట్లు కల్నల్ విష్ణుప్రసాద్ నెయిర్ తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. శిబిరంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్‌డీఎస్‌డబ్ల్యూ కేడెట్స్, జేడీ కేడెట్లు పాల్గొంటున్నారని తెలిపారు. వీరికి ఆయుధ శిక్షణ, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిగత పరిశుభ్రత, సామాజికసేవ, వ్యక్తిత్వ వికాసం, ఎఫ్‌పీబీసీ డ్రిల్ మ్యాప్ రీడింగ్, ఎన్‌సీసీ వ్యవస్థపై శిక్షణ ఇస్తామని తెలిపారు. 600 కేడెట్లను అల్ఫా, బ్రేవో, చార్లీ, డెల్టా కంపెనీలుగా విభజించి, పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.